# ఓడినా ప్రజల మధ్యనే ఉంటాం..




వనపర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- ఫలితాలను సమీక్షిస్తాం
- ప్రజల కోణం తెలుసుకుంటాం
- రైతు బంధును తక్షణమే ఇవ్వాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో ఓడినా.. గెలిచినా ప్రజల మధ్యనే ఉంటామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. తన ఓటమి కంటే కామారెడ్డిలో తెలంగాణ ఉద్యమ శిఖరం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఓటమిని తాను జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన చెందారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, జిల్లా ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ లక్ష్మయ్య, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్‌తో కలిసి మాజీ మంత్రి సింగిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము గెలిచిన రోజు పొంగిపోలేదని, నేడు ఓటమి ద్వారా కుంగిపోయేది లేదన్నారు. ఎన్నికల ఫలితాలను సమీక్షించుకుంటామని, ప్రజల కోణం తెలుసుకుంటామని అన్నారు. నిత్యం గ్రామాల్లోనే ఉండి ప్రజల చెంతనే ఉంటామని, ఓటమి చెందినంత మాత్రానా ఎక్కడికి వెళ్లేది లేదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపైన తామే పట్టు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధానిగా చేసిన ఇందిరాగాంధీతోపాటు అనేక మంది ముఖ్యమంత్రులు ఓడిపోయిన సందర్భాలను చూస్తూనే ఉన్నామన్నారు. తాను సహి తం ఓటమి ద్వారానే గెలుపును సొంతం చేసుకున్న వాడినేనన్నారు. నా ఓటమి నన్ను బాధించలేదని, కా మారెడ్డిలో తెలంగాణ ఉద్యమ కెరటం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నామని సింగిరెడ్డి కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఏనాడు రాష్ట్ర సాధనలో పాలుపంచుకోని వారు రాష్ట్రం సాధించిన నేతను ఓడించ డం అత్యంత బాధకరమన్నారు. ఆచరణ సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని, వారిచ్చిన హామీల అమలు చేయడంపైనే తాము దృష్టి పెడతామన్నారు. కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానాలను తెలుసుకునేందుకు ఎక్కువ సమయం పట్టదని, ఆరు నెలల్లోనే తేటతెల్లం అవుతుందని సింగిరెడ్డి పేర్కొన్నారు. తాము చేపట్టిన అభివృద్ధి పనుల్లోనే తాము ఎప్పటికీ గుర్తుంటామని, విద్యాసంస్థలు, రిజర్వాయర్లు, పంట కాల్వలు, సాగవుతున్న పచ్చని పైర్లు ఇందుకు నిదర్శనంగా కనిపిస్తాయన్నారు. ఏడాదిపాటు సొంత పార్టీలో ఉండి అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేసి తాత్కాలిక లబ్ధిపొందారన్నారు. నాలుగైదు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా ఉన్న వారు సహితం చేయలేని పనులను ఒక్క అవకాశంలోనే చేసి చూయించామని, ప్రజల నుంచి తనను వేరు చేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. దేనిని గుడ్డిగా వ్య తిరేకించమని, హుందాగా రాజకీయాలు చేశామని, ఇకముందు కూడా అదే బాటను అనుసరిస్తామని ప్రకటించారు.

### రైతుబంధును తక్షణమే ఇవ్వాలి

కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తక్షణమే యాసంగిలో 75లక్షల మంది అన్నదాతలకు రైతుబంధును విడుదల చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. తాను వ్యవసాయ మంత్రిగా 90శాతం రైతు రుణ మాఫీని పూర్తి చేయడం జరిగిందని, ఇక కేవలం 10శాతం మాత్రమే మిగిలి ఉన్న రుణమాఫీని సహితం వా రం రోజుల్లో అమలు చేయాలన్నారు. కొత్త ప్రభుత్వంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యాసంగిలో రైతులకు ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నాయకులు తిరుమల మహే శ్, వాకిటి శ్రీధర్, పురుషోత్తంరెడ్డి, రాములుయాదవ్, కురుమూర్తి యాదవ్, కృష్ణానాయక్, లక్ష్మా రెడ్డి, గౌని బిచ్చారెడ్డి, నందిమళ్ల అశోక్, శ్యాం పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

## జోగుళాంబకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు

అలంపూర్, డిసెంబర్ 4 : అలంపూర్‌లోని ఐదో శక్తి పీఠమైన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను సోమవారం ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్న కృష్ణయ్యానాయుడు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వారిని శేషవస్త్రాలతో సన్మానించి ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



జోగుళాంబ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

## ఏ కష్టం వచ్చినా ముందుంటా..

- ప్రభుత్వం రాలేదని అధైర్య పడకండి
- కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటా
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



గద్వాల, డిసెంబర్ 4: కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా మీ ముందుంటానని, మన ప్రభుత్వం రాలేదని ఎవరూ అధైర్య పడవద్దని మీ అందరికీ అండగా ఉండి మిమ్మల్ని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేసిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పేరుపేరున ధన్యవాదాలు చెప్పారు. ఈ గెలుపు ప్రజలేదని చెప్పారు. గ్రామాల్లో ఉన్న కార్యకర్తలు సమన్వయం పాటించాలని, కాంగ్రెస్ నాయకులు మనల్ని రెచ్చగొట్టే విధంగా ప్రయత్నిస్తారని అలాంటప్పుడు మనం మనో నిబ్బరంతో ఉండాలని సూచించారు. మనం శాంతియుతంగా గెలిచామని గద్వాలను అభివృద్ధి చేసే దిశగా ముందుకు వెళ్దామని చెప్పారు. బీఆర్‌ఎస్ విజయం ప్రజలందరి విజయమని ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందరం కలిసి గద్వాలను అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత నాపై ఉందని చెప్పారు. కార్యకర్తలు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

## గులాబీ సైనికులే నా బలం..బలగం

- నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి



నారాయణపేట, డిసెంబర్ 4 : గులాబీ సైనికులే నా బలం.. నా బలగం, నా కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా ఆదుకుంటానని మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. పదేండ్లుగా నా వెంట నడిచిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. ఈ ఎన్నికల్లో శాయశక్తులా కృషి చేసిన ప్రతి కార్యకర్త, నాయకులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా పని చేసిన అభిమానులు, ఓటు వేసిన ఓటరు మహాశయులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష హోదా తీర్పును శిరసావహిస్తానన్నారు. గెలిచిన అభ్యర్థికి శుభాకాంక్షలు తెలియజేస్తూ నారాయణపేట నియోజకవర్గ అభివృద్ధి ప్రగతి పనులను ముందుకు తీసుకువెళ్లాలని కోరుకుంటున్నానని సూచించారు. కొత్త ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు తాము సహకరిస్తానని ప్రకటించారు.

## ప్రజా తీర్పును గౌరవిస్తాం

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర, డిసెంబర్ 4 : నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును నిరంతరం గౌరవిస్తామని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల మాట్లాడుతూ తొమ్మిదిన్నరేండ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రజల అభివృద్ధి, సంక్షే మం కోసం అలుపెరుగకుండా పనిచేసామన్నారు. ఓట్లు వేసిన ప్రజలను ఎప్పటికీ విస్మరించకూడదని తమ నాయకుడు తమకు తరుచూ చెప్పేవారన్నారు. తమ పార్టీ ఓడిపోయినా ప్రజలకు సేవ చేసేందుకు అందుబాటులో ఉంటామన్నారు. ప్రజల కోణంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త ప్రభుత్వం పని చేస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఎన్నికలో గెలుపోటములు సహజమని, దీనిని స్పోర్టీవ్‌గా తీసుకొని ముందుకు సాగుతామన్నారు. తన విజయాన్ని ఆకాంక్షిస్తూ ఇప్పటి వరకు శ్రమించిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు అభిమానులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికలో ఓడినా నిరంతరం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటాన్నారు. నియోజకవర్గ ప్రజలు 87వేలకు పైగా ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. తక్కువ మెజార్టీతో మనం ఓడిపోయాం.. కార్యకర్తలు అధైర్యపడొద్దు అందరికీ నిరంతరం అదుబాటులో ఉంటా ను. ప్రస్తుతం నియోజవర్గంలో ఒక ఎమ్మెల్యే మినహా నియోజకవర్గంలో ఉన్న ప్రతిప్రజాప్రతినిధులు అంతా బీఆర్‌ఎస్ పార్టీ వాళ్లే ఉన్నారు. కావున కార్యకర్తలు ఎప్పుడూ నిరుత్సాహం చెందకూడదన్నారు. తనపై గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డికి, నూతనంగా ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుగా ఆయన శుభాకాంక్షాలు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ రమాదేవి, ముడా డైరెక్టర్ కర్ణంరాజు, సహకార సంఘం చైర్మన్లు దోకూర్ నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డి, నాయకులు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, శ్రీకాంత్ యాదవ్‌బాలరాజు, కొండ శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్, జహంగీర్, వేణుగోపాల్, ఉస్కిల వెంకట్రాములు, యుగేంధర్‌రెడ్డి, రాధాకృష్ణ, సయ్యద్ జక్కి, తమ్మన్నతోపాటు వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యం

- పలు చోట్ల బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడి
- పెద్దకొత్తపల్లి మండలంలో పలువురు నాయకుల ఇండ్లు ధ్వంసం



దాడిలో గాయపడిన పెద్ద వెంకన్న

హన్వాడ, డిసెంబర్ 4 : మండలంలోని పల్లెమోనికాలనీ బీఆర్‌ఎస్ సర్పంచ్ వెంకటమ్మ భర్త పెద్ద వెంకన్నపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆదివారం రాత్రి దాడి చేశారు. సర్పంచ్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా యెన్నం గెలుపొందిన సందర్భంగా సాయంత్రం పల్లెమోనికాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సం బురాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్తుడంగా సర్పంచ్ భర్త పెద్ద వెంకన్న ఇంటి దగ్గర ఉండి సంబురాలను చూస్తుడంగా ఇదే కాలనీకి చెం దిన శ్రీకాంత్, శివకుమార్, రమేశ్ మా ఎమ్మెల్యే గెలిచారని ఎగతాళి చేయడంతోపాటు నానా బూతు మాటలు తిట్టి ఆయనపై అకారణంగా దాడి చేశారని తెలిపారు. అలాగే పక్కనే ఉన్న మరో బీఆర్‌ఎస్ కార్యకర్త ఆంజనేయులుపై కూడా దాడి చేయడంతో ఆయన తలకు గాయాలయ్యాయి. తమపై శ్రీకాంత్, శివకుమార్, రమేశ్ అకారణంగా దాడి చేయడంతో వారిపై చర్యలు తీసుకోవాలని హన్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాపైదాడి చేసిన వారే ఓ గిరిజన వ్యక్తి నుంచి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఆరోపించారు. దీనిపై ఎస్సై రవినాయక్‌ను వివరణ కోరగా ఇద్దరు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారని, మళ్లీ వారు కలిసి మాట్లాడుకుంటాం అని అన్నారని, లేనిచో విచారణ నిర్వహించిన కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

### బీఆర్‌ఎస్ నాయకుల ఇండ్లపై కాంగ్రెస్ శ్రేణుల దాడులు

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 4 : కొల్లాపూర్‌లో జూపల్లి కృష్ణారావు గెలవడంతో హస్తం పార్టీ శ్రేణులు నియోజకవర్గంలో ఆదివారం రాత్రి పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల ఇండ్లపై దాడులకు పాల్పడ్డా డు. కొల్లాపూర్ మండలం సింగవట్నంలో కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ వెళ్తుండగా, ఆ పక్క నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలైన శివ, బాలపీరు, రాముడు కారులో వెళ్తుండగా కాంగ్రె స్ కార్యకర్తలు కారుపై రాళ్లు విసిరారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు కారు దిగివచ్చి కారుపై రాయి ఎందుకు వేశారని ప్రశ్నించగా, అందుకు ఆగ్రహించిన కాంగ్రెస్ కార్యర్తలు రెచ్చిపోయి వారిని వెంటాడుతూ రాళ్లతో దాడిచేశారు. అలాగే పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లో పోలింగ్ ముందు రోజు రాత్రి కత్తిపోటుకు గురైన, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నాయకుడు గుజ్జుల పరమేశ్ ఇంటిపై ఆదివారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లతో చేసిన దాడిలో కిటికి అద్దాలు, ఇంటి గేటు ధ్వంసమైయ్యాయి. అలాగే విధంగా దేదినేనిపల్లి గ్రామంలో హస్తం పార్టీ శ్రేణులు రాత్రి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తూ తాగినమైకంలో బీఆర్‌ఎస్ నా యకుడు మల్లేశ్(ఎంపీటీసీ భర్త) ఇంటిపై దాడి చేసి ప్రహరీని ధ్వంసం చేశారు. అదే గ్రామం లో శ్రీపతిరా వు ఇంటి కిటికీలు పగులగొట్టారు. అలాగే కురుమ కులానికి చెందిన భార్యాభర్తలను చితబాదడంతోపాటు వాల్మీకి కార్యకర్త ఇంటిపైనున్న ప్లాస్టిక్ కవర్‌ను లాగి నిప్పుపెట్టారు.